పన్ను వసూళ్లపై అధికారుల నజర్

- ● మున్సిపాలిటీలో వందశాతం వసూళ్లే లక్ష్యంగా ముందుకు
- ● మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ
- ● ఆర్థిక సంవత్సరం ముగింపుకు 38రోజులే గడువు



భువనగిరి మున్సిపాలిటీలో రెడ్ నోటీసులు జారీ చేస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది

భువనగిరిటౌన్ : వందశాతం ఆస్తిపన్ను వసూలు చేసి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు కలిపించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో పన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి 31వతేదీన నాటికి మున్సిపాలిటీలో రూ.10.01కోట్లు వసూళ్లే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.4.20కోట్లతో పన్ను వసూళ్లు అంత ఆశాజనకంగా లేదు. ప్రస్తుతం 38రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలనే అధికారులు కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీలో 42శాతం మేర వసూళ్లు మాత్రమే జరిగాయి. కాని ప్రజలు నిర్ణీత గడువు ముగిసే సమయంలో ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు మాత్రం అలాంటి అఫర్లు ఉండవని చెబుతున్నారు.

రెడ్ నోటీసులు జారీ..

మున్సిపాలిటీ పన్నుల బకాయిలు అధికంగా ఉన్న వారికి అధికారులు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే టాప్ 100మందికి రెడ్ నోటీసులు అందజేశారు. వారి నుంచి రూ.2.40కోట్ల వరకు పన్నులు రావాల్సి ఉంది. నోటీసులు అందుకున్న వారు మూడు రోజుల్లో పన్ను చెల్లించకుంటే జప్తు చేసే అధికారం మున్సిపాలిటీకి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

సెలువు రోజుల సైతం..

పన్ను వసూలు 100శాతం చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బిల్ కలెక్టర్లు వార్డుల వారీగా బకాయిల జాబితాను తీసుకొని ఇంటింటికి వెళ్లి వసూలు చేస్తున్నారు. గడువు సమీపిస్తుండడంతో ఆదివారంమే కాకుండా సెలవు రోజుల్లో సైతం పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో కార్యాలయ పని వేళలను సైతం ఉదయం 7నుంచి సాయంత్రం 7గంటల వరకు మార్చారు. సకాలంలో పన్నులు చెల్లించి, అభివృద్ధికి సహకరించాలని మున్సిపాలిటీలో మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. సకాలంలో పన్ను చెల్లిస్తే అపరాధ రుసుం ఉండదని, పన్ను చెల్లించకుంటే అపరాధ రుసుంతో అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. సెలవు రోజుల్లో కూడా పన్నుల వసూళ్లకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అధికారులు సూచిస్తున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం

మున్సిపాలిటీ పరిధిలో మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. స్పందించని పక్షంలో మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయి. వందశాతం ఆస్తిపన్ను వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు అందరూ ఆస్తి పన్ను తప్పకుండా చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

– రామలింగం, కమిషనర్ భువనగిరి

కృష్ణాజలాలు తరలిస్తున్నా స్పందించని ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పక్కన మాజీ ఎమ్మెల్యే సునీత

భువనగిరి : ఆంధ్రా వారు కృష్ణానది జలాలను తరలించుకుపోతున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడం లేదని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కృష్ణానది జలాలలో తెలంగాణకు కుడికాల్వ ద్వారా రావాల్సిన వాటాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరలించుకుపోతున్నా రేవంత్ రెడ్డి స్పందించకుండా ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు సాగు, తాగునీటి సమస్య ఉన్నా జిల్లా మంత్రిగా ఉన్న నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. అధికారిలోకి వచ్చిన సంవత్సరంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలలో వ్యతిరేకత వచ్చిందన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మొద్దునిద్ర వీడి ప్రజలకు ఇబ్బందుల రాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జనగాం పాండు, పార్టీ పట్టణ కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీరు మల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నర్సింహ, అజీమోద్దీన్, బబ్లూ, వీరేశం, తదితరులు ఉన్నారు.

అసెంబ్లీలో ఉద్యమకారుల బిల్లు ప్రవేశపెట్టాలి

వలిగొండ : తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాటాలు చేసి జైలు జీవితం గడిపిన ఉద్యమకారులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేందుకు వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఉద్యమకారుల బిల్లు ప్రవేశపెట్టాలని టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాలతో, బలిదానాలతో రాష్ట్రాన్ని సాధిస్తే పది సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వం ఉద్యమకారుల ఊసెత్తలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

బిక్కేరులో నీరు పారించిన ఘనత సీఎందే

● ఎమ్మెల్యే మందుల సామేల్



బిక్కేరులో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు : యాసంగి వరిపంటలు రక్షించేందుకు మండు వేసవిలో బిక్కేరులో నీరు పారించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలదేనని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని సదర్శాపురం బిక్కేరు చెక్ డ్యాం వద్ద గోదావరి నది జలాలకు ఆయన పూజలు చేసి నీటిలో పూలు, పసుపు, కుంకుమలు వదిలారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత బిడ్డగా, ఒక రైతుగా, రైతుల బాధలు తెలిసిన వాడిగా బిక్కేరు వెంట ఇసుక బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో గోదావరి నది జలాలను విడుదల చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ బిక్కేరు పారిన దాఖలాలు లేవని, గోదావరి నది జలాలను పారించడంతో ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు, అడ్డగూడూరు మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, మార్కెట్ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చేడె చంద్రయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పల్లెర్ల భాస్కర్, మందుల సురేష్, గొట్టు వెంకన్న, వర్రె బుచ్చినర్సు, వర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పాత్ర కీలకం

మోత్కూరు : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీకి బలం యువజన సంఘమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి పల్లపు సమ్మయ్య, ఎండీ.జావేద్, కోమటి జనార్దన్, పట్టణ, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు అన్నెపు పద్మ, ముద్దం జయశ్రీ పాల్గొన్నారు.

మాతృభాషను విస్మరించొద్దు



రామన్నపేట : మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాహత్‌ఖానం

రామన్నపేట: మాతృభాషను పరభాషా మోజులో పడి విస్మరించొద్దని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం అన్నారు. శుక్రవారం కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాతృభాషలో అభ్యసించడం వల్ల విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయి వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్ రావు, తెలుగువిభాగం అధ్యక్షుడు డాక్టర్ తండు క్రిష్ణకౌండిన్య, అధ్యాపకులు డాక్టర్ చిన బాబు, డాక్టర్ సిహెచ్.వెంకట్ గౌడ్, అనిత, డాక్టర్ కిషన్, డాక్టర్ బ్రహ్మం, డాక్టర్ రవీందర్ రావు, టి.శ్రీనివాస్, ఎ.ఆంజనేయులు, ఓ.యాదగిరి, జె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వికాసం మాతృభాషతోనే సాధ్యం

వలిగొండ : విద్యార్థుల విద్యావికాసం మాతృభాషతోనే సాధ్యం అవుతుందని మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని లోతుకుంటలో గల ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాతృభాషపై పట్టున్న విద్యార్థులు మిగతా భాషలను సులభంగా అవగాహన చేసుకొని ప్రావీణ్యం పొందుతారని అన్నారు. ఈ సందర్భంగా 116మంది తెలుగు కవుల చిత్రపటాలను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రైసున్నీసాబేగం, ఉపాధ్యాయులు శేఖర్, కృష్ణ, ఎండీ గౌస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో బ్రిలియంట్ స్కూల్‌లో శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాతృభాష విలువలను తెలియచేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పావని కోటేశ్వరి, సిబ్బంది యాదగిరి, వైష్ణవి, రజిత, విజయ, మోహన్ రాజ్, నాగలక్ష్మి, నాగమణి, మౌనిక, లావణ్య, గౌతమి, అశ్విని, అలివేలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వలిగొండ : తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న ఎంఈఓ, విద్యార్థులు



ఆత్మకూరు(ఎం)లో మాతృభాష దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి



అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం) : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్‌గౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం పల్లెర్ల, కూరెల్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, జిల్లా నాయకలు తడిసిన మల్లారెడ్డి, నాయకులు దయ్యాల కుమారస్వామి, బండారు సత్యనారాయణ, లోడి వెంకటయ్య పాల్గొన్నారు.

తాగునీటి కొరత గ్రామాలను గుర్తించాలి



ఆత్మకూరు(ఎం) : సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ మెహర్‌సాయి

ఆత్మకూరు(ఎం) : మండలంలో తాగునీటి కొరత ఉన్న గ్రామాలను గుర్తించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మెహర్‌సాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామాల వారీగా తాగునీటి కొరతపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ రాములునాయక్, ఎంపీఓ లోకేశ్వర్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

చౌటుప్పల్ : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీడీఓ సందీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓకార్యాలయంలో వేసవిలో నీటి ఎద్దడిపై పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో నీటిఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

స్వపరిపాలన దినోత్సవం

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ హోదాల్లో అలరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాందయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చిత్తరంజన్, శ్రీనువాస్, లలిత, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న గంగాపురం మల్లేష్

మోటకొండూర్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గంగాపురం మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మోటకొండూర్ మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు అనంతుల నవీన్‌రెడ్డిని డీసీసీబీ ఆదేశాల మేరకు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆలేరు మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొంతం మోహన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుణి రఘునాథరాజు, బోయిని జాన్సీ, భూమండ్ల శ్రీనివాస్, మధు ఉన్నారు.

కుట్రపూరిత చర్యలు మంచిది కాదు

కాంగ్రెస్‌లో నిజమైన కార్యకర్తలను కుట్రపూరితంగా పార్టీ నుంచి బహిష్కరించడం పార్టీకి మంచిది కాదని మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు అనంతుల నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కాకుండా ఒక సామాజిక వర్గం కోసం నిజమైన కార్యకర్తను డీసీసీబీ ఆదేశించకపోయినా తప్పు చర్యలు పాల్పడ్డారని ఆరోపించారు. నిజాయితి గల కార్యకర్తలను పార్టీకి దూరం చేస్తే పార్టీకి నష్టమే కాని లాభం కాదన్నారు.

కాంగ్రెస్ మహిళా విభాగం పట్టణ, మండల అధ్యక్షుల నియామకం



అన్నెపు పద్మ



ముద్దం జయశ్రీ

మోత్కూరు : పట్టణానికి చెందిన ముద్దం జయశ్రీ కాంగ్రెస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా, అన్నెపు పద్మ కాంగ్రెస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ నియామకపత్రాలు అందజేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షురాలు పద్మకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా నవ్య



నియామక పత్రం అందుకుంటున్న నవ్య

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రానికి చెందిన దొంతరబోయిన నవ్య కాంగ్రెస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలుగా నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు.

లోఓల్టేజి సమస్య పరిష్కరించాలి

గుండాల : మండలంలోని సీతారాంపురం గ్రామంలో నెలకొన్న లోఓల్టేజి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా చేపట్టారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడారు. 15రోజులుగా లోఓల్టేజితో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ అందకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు ఎం.సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేష్, సోమన్న, సురేందర్, మనోహర్, వెంకట్‌రెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్డీ ఆవిర్భావ దినోత్సవం

రామన్నపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జాతీయ వికలాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్డీ) ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనం ఉపేందర్ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రైవేటు పరిశ్రమలలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బొడ్డుపల్లి వెంకటేశం, నాగు నర్సింహ, పున్న శ్రీధర్, నోముల రవివర్మ, శివ, ఉదయ్, బీరప్ప, మల్లమ్మ, వెంకటేశం, శ్రీను, నరసింహ, ఆవనగంటి నాగేష్, జంగయ్య, నర్సింహ, ఉపేందర్, నర్సమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ బాక్సుల చోరీ దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ శ్రీశైలం

బొమ్మలరామారం : నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద సెంట్రింగ్ బాక్సులను చోరీ చేసిన దొంగను మండల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను ఎస్ఐ శ్రీశైలం వెల్లడించారు. మండలంలోని నాగినేనిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము నగేష్ సెంట్రింగ్ పనుల చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చీకటిమామిడి గ్రామంలో ఓ భవనానికి సెంట్రింగ్ పనులు చేసేందుకు ఈ నెల 19న వెళ్లాడు. అక్కడికి వెళ్లే సరికి సెంట్రింగ్ బాక్సులు కనపడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌హెచ్ఓ శ్రీశైలం దర్యాప్తు చేపట్టారు. మండలంలోని రంగాపూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఓ వ్యక్తిని పట్టుకుని విచారించగా సెంట్రింగ్ బాక్సులు చోరీ చేసినట్లు తెలిపాడు. సదరు వ్యక్తి నుంచి చోరీ చేసిన 43 సెంట్రింగ్ బాక్సులతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు త్వరితగతిన చేధించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్‌లు రాజు, మహబూబ్, సందీప్‌లను ఎస్ఐ అభినందించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న సందీప్‌రెడ్డి

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి సందీప్‌రెడ్డి సొంత ఖర్చుతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.2500, రెండో ర్యాంక్ సాధించిన వారికి రూ.1500, మూడో ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.1000నగదు బహుమతి అందిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పరిగల సత్యనారాయణ, తుప్పతి లక్ష్మీనారాయణ, బైరెడ్డి జగదీష్‌రెడ్డి, గండేల రవి, షేక్ సమీర్, సోయల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సాగునీరు అందించాలని ప్రార్థన

రాజాపేట : మండలంలోని గొలుసుకట్టు చెర్వులకు సాగునీరు అందించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేసి జలసాధన సమితి నాయకులకు మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి రాజాపేట రైతులకు గోదావరి జలాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు తయ్యబ్ అలీ, జహంగీర్, జేఏసీ నాయకులు జశ్వంత్, అశోక్‌గౌడ్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

50పడకల ఆసుపత్రిగా మార్చాలని వినతి

భూదాన్‌పోచంపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50పడకల ఆసుపత్రిగా మార్చాలని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల, పట్టణ కార్యదర్శులు కోట రాంచంద్రారెడ్డి, దుబ్బాక జగన్ మాట్లాడారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఆరు పడకలు మాత్రమే ఉన్నాయని, రోగులు అత్యవసర సమయాలలో ఆసుపత్రికి వస్తే సరైన డాక్టర్లు లేక వైద్య సేవల కోసం పేదలు హైదరాబాద్‌కు వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో మంచాల మధు, బుగ్గ లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, జంగారెడ్డి, రాజు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చౌటుప్పల్ : ఈ నెల 23న నిర్వహించే గురుకుల ప్రవేశపరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల ప్రిన్సిపల్ పి.కవిత శుక్రవారం తెలిపారు. తూప్రాన్‌పేట గురుకులంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 5, 6, 7, 8, 9వ తరగతులకు సంబంధించి 462మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 01గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

బీబీనగర్ : మండల కేంద్రంలోని గురుకుల ఎస్సీ, బీసీ పాఠశాలల్లో 5వతరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు ఈ నెల 23న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్స్ సబ్బు రూప, మాధవి శుక్రవారం తెలిపారు.

మోత్కూరు : 2025–2026 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో గురుకుల ప్రవేశానికి సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 23న స్థానిక సాంఘీక, సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారద శుక్రవారం తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరపాలి

గుండాల : మండల కేంద్రంలో అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు కుమ్మక్కై భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. 177 సర్వే నంబర్‌లో ఉన్న 9.17ఎకరాల భూమిని కాజేసే ప్రయత్నం చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట దార సైదులు ఉన్నారు.

క్లుప్తంగా

రమణేశ్వరంలో 101 శివలింగాలకు ప్రాణప్రతిష్ఠ



శివలింగానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో గల రమణేశ్వరంలో శివలింగాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దగురు రమణానంద మహర్షి 101శివలింగాలను ప్రతిష్ఠించారు. అనంతరం వాటికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం శివలింగాలకు కళాన్యాసం, బలిప్రదానం, కుంభాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూర్ణహుతి హవనం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పాల శ్రీనివాస్‌కు డాక్టరేట్

గుండాల : మండలంలోని వంగాల గ్రామానికి చెందిన పాల శ్రీనివాస్ (అలెగ్జాండర్) డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ బి.మురళీకృష్ణ పర్యవేక్షణలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్‌లో తృతీయ స్థాయిలో అభ్యాసకులకు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను బలోపేతం చేయడానికి డిజిటల్ వనరులను ఉపయోగించడం అనే అంశంపై విజయవంతంగా పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆయనకు శుక్రవారం డాక్టరేట్ ప్రకటించింది. శ్రీనివాస్‌కు డాక్టరేట్ రావడం పట్ల గ్రామస్తులు అభినందించారు.

మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతల స్వీకరణ



బి.పూజ

ఆత్మకూరు(ఎం) : మండల వ్యవసాయ శాఖ అధికారిగా బి.పూజ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె వికారాబాద్ జిల్లా కొడంగల్ నుంచి ఇక్కడకు ఏటగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఏటగా పనిచేసిన అపర్ణ మరో చోటుకు బదిలీఅయ్యారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు(ఎం) : ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మండల కేంద్రంలో తహసీల్దార్ వి.రవికుమార్, ఎంపీడీఓ రాములునాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో 46 ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నట్లు తెలిపారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దీన్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



నూతనగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ సుధీర్‌కుమార్

భువనగిరి : నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ ఎస్ఈ సుధీర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నందనం గ్రామంలో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 5ఎంవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అధిక లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాలను పెంచుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1,48,389 మంది గృహజ్యోతి పథకం కింద లబ్ధిపొందుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు వస్తే వెంటనే సంబంధిత సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ ఆనంద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి

రామన్నపేట : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే వేముల వీరేశం కృషి చేస్తున్నారని టీపీసీసీ మాజీ కార్యదర్శి గోదాసు పృథ్వీరాజ్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జెల్లవెంకటేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని లోతుకుంట సమీపంలో ఎమ్మెల్యే సహకారంతో క్రీడామైదానం ఏర్పాటు కోసం భూమిని చదును చేసే పనులను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల విన్నపం మేరకు ఎమ్మెల్యే స్థలాన్ని పరిశీలించి మైదానం ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించడం హర్షణీయమన్నారు. క్రీడాకారులు మైదానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దిన్, నాయకులు ఎండీ అక్రం, ఎండీ నాజర్, కోట సుధాకర్, గొలుసుల ప్రసాద్, ఎండీ ఖరీం, యువకులు పాల్గొన్నారు.